క్లుప్తంగా

బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా సత్యం

చిక్కడపల్లి: గాంధీనగర్ బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడిగా దోనేటి సత్యం నియమితులయ్యారు. శుక్రవారం బీజేపీ కార్యాలయంలో ఆయనకు ముషీరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ ఎం.ఉమేశ్ నియామకపత్రాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ.. డివిజన్‌లో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నేతలు పూస రాజు, రత్నసాయిచంద్, లక్ష్మణ్‌యాదవ్, నవీన్‌కుమార్, ముకుంద్ తదితరులు పాల్గొన్నారు.

పూలే జయంత్యుత్సవాల కమిటీ చైర్మన్‌గా అంజి



కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈనెల 11 న నిర్వహించే మహాత్మ జ్యోతిరావు పూలే జయంత్యుత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా జిల్లాపెల్లి అంజిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేసింది. ప్రస్తుతం ఆయన రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. బీసీ విద్యార్థి సమస్యలపై పదేళ్లుగా పోరాడుతున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తనను ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా నియమించిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

వైస్ చైర్మన్‌గా నేరడి భూపేష్ సాగర్..



కాచిగూడ: మహాత్మాజ్యోతిరావు పూలే జయంత్యుత్సవాల కమిటీ వైస్ చైర్మన్‌గా నేరడి భూపేష్ సాగర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా ప్రస్తుతం ఆయన కొనసాగుతున్నారు. గత 20 ఏళ్ల నుంచి బీసీ సమస్యలపై ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగే పోరాటంలో పాల్గొంటూ వస్తున్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

సామాజిక సేవతోనే సంతృప్తి



జీహెచ్ఎంసీ స్వీపర్లకు చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కాచిగూడ: సామాజిక సేవతోనే నిజమైన సంతృప్తి ఉంటుందని తెలంగాణ మున్సిపల్ స్వీపర్ అండ్ కామాటి వెల్ఫేర్ సొసైటీ యూనియన్ అధ్యక్షుడు గాలిపెల్లి కృష్ణ అన్నారు. బర్కత్‌పురలోని తుల్జాభవన్‌లో జీహెచ్ఎంసీ స్వీపర్లకు యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందిరతో కలిసి ఆయన చీరలను పంపిణీ చేశారు. ఎంత సంపాదించినా రాని ఆనందం పేదలకు చేయూతను అందించడంలో ఉంటుందన్నారు. యూనియన్ స్థాపనకు ముందే సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఇందిర భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు. యూనియన్ ప్రతినిధులు ఎస్.రేణుక, దర్శన్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

చిక్కడపల్లి: బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ జెండాను ఆ పార్టీ నేతలు ఆవిష్కరించారు. శుక్రవారం బీజేవైఎం నగర పూర్వ అధ్యక్షులు ఎ.వినయ్‌కుమార్, డివిజన్ పార్టీ అధ్యక్షుడు రత్నసాయిచంద్‌లు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి నీతివంతమైన పాలనను ప్రపంచదేశాలు హర్షిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. బీజేపీ నాయకులు నవీన్‌కుమార్, శ్రీకాంత్, సత్తిరెడ్డి, శివకుమార్, సత్యం, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం



ఆనం జయలక్ష్మి (ఫైల్)

నల్లకుంట: కూతురు వద్దకు వచ్చిన ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పీఆర్ఓగా పనిచేస్తున్న పాలిశెట్టి ఫణికుమార్ కుటుంబ సభ్యులతో కలిసి పాత నల్లకుంట పాతరామాలయం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. మతిస్థిమితం సరిగ్గా లేని ఫణికుమార్ అత్త ఆనం జయలక్ష్మి(68) గత మూడు నెలలుగా వీరి వద్దే ఉంటోంది. ఈ నెల 6న ఉదయం 10.30 గంటల సమయంలో ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానికులు, బంధువులను ఆరాతీయగా.. ఆచూకీ లభించలేదు. దీంతో వారు గురువారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీచర్ల ప్రమోషన్లను అమలు చేయాలి

స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ ధర్నా



ఇందిరాపార్కు వద్ద ధర్నా చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్ సభ్యులు

కవాడిగూడ: 8 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ (ఎస్ఏఏ) ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల నుంచి ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ధర్నాకు బీజేపీ ఎమ్మెల్సీ ఏవీన్ రెడ్డి, మాజీ ఎంపీ వి. హనుమంతరావు హాజరై మద్దతు ప్రకటించారు.

- రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి తక్షణమే ఉపాధ్యాయులకు ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.
- ఉపాధ్యాయులు చేసే న్యాయమైన ఉద్యమానికి తమ పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు హామీ ఇచ్చారు.
- గత 8 ఏళ్లుగా ఉపాధ్యాయులు ప్రమోషన్లు లేక రిటైర్ అయ్యారని ఇంకా అవుతూనే ఉన్నారని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నరేంద్రస్వామి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు అన్నారు.
- పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉండటం వల్ల పర్యవేక్షణ లేక విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయన్నారు.
- తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వం ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయకపోవడంతో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పదోన్నతుల సాధన సమితి కన్వీనర్ సుధాకర్‌రావు పేర్కొన్నారు.
- బడుగుబలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, అశోక్, మహేందర్‌రెడ్డి, శ్రీకాంతరావు, వేణు, వాసుదేవరెడ్డి, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మతపరమైన రాజకీయాలు మానుకోవాలి'



బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తలసాని, దాసోజు శ్రవణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్



ప్రొఫెసర్ జయశంకర్, నాయినినర్సింహ్మారెడ్డి చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: మతపరమైన రాజకీయలు మానుకొని అభివృద్ధి విషయంలో పోటీపడాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతూ.. 'కేంద్రం నుంచి రూపాయి తెచ్చే దమ్ము బీజేపీ నేతలకు లేదని' విమర్శించారు. జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్ అధ్యక్షత ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా.. ముఖ్యఅతిథిగా మంత్రి తలసాని హాజరై మాట్లాడారు. దేశంలో ఎక్కడాలేని పథకాలను రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారన్నారు. దేశంలో తెలంగాణ భూభాగం కానట్లుగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆరోపించారు.

- దేశంలో ఏ పార్టీకి కూడా బీజేపీని ఎదుర్కొనే శక్తి లేదని అది కేవలం సీఎం కేసీఆర్‌కే ఉందన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాజ్యసభ ఎంపీ లక్ష్మణ్‌లు రాష్ట్రానికి ఒక్క లక్ష రూపాయలు కూడా తేలేదని విమర్శించారు. ఢిల్లీ ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి ఏడాదికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారన్నారు.
- దేశంలో మొట్ట మొదటిసారిగా ప్రభుత్వ డబ్బులు రూ.1200 కోట్ల ద్వారా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని నిర్మించింది తెలంగాణ ప్రభుత్వమన్నారు.
- నియోజకవర్గంలో త్వరలో 1300 మంది లబ్ధిదారులకు దళితబంధు అమలు చేస్తామన్నారు.

ముచ్చటగా మూడోసారి రాష్ట్రంలో అధికారంలోకి రావాలనే ఉద్దేశ్యంతో ఆత్మీయ సమ్మేళనాలు చేపడుతున్నామని ప్రజలందరూ బీఆర్ఎస్‌ను ఆశీర్వదించాలని బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్‌కుమార్ అన్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ముఠా జైసింహ, దామోదర్‌గుప్తా, నగర పార్టీ మాజీ అధ్యక్షుడు కట్టెల శ్రీనివాస్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు ముఠాపద్మనరేష్, మాచర్ల పద్మజ, రవీందర్, పార్టీ నాయకులు ముఠా నరేష్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, గుండు జగదీశ్, రాజ్‌మోహన్, ముచ్చకుర్తిప్రభాకర్, పోతుల శ్రీకాంత్, రవిశంకర్‌గుప్తా, పీఎస్ శ్రీనివాస్, సుధాకర్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

పొలిటికల్ ఫ్రంట్ సభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అంసోల్ లక్ష్మణ్ తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం ఉమ్మడి లక్ష్యంగా ఈనెల 11న నిర్వహించే సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని బహుజన విముక్తి పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకల జనుల అభివృద్దే లక్ష్యంగా రాష్ట్ర పునర్నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందరికీ విద్య, వైద్యం బీసీ కులగణన తదితర అంశాలపై చర్చ జరుగుతుందన్నారు. ఈ సభకు ఢిల్లీ యూనివర్శిటీ ప్రొఫెసర్ సూరజ్ మండల్, ప్రొఫెసర్ మురళీ మనోహర్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి తదితరులు హాజరు అవుతారన్నారు. భారత్ ముక్తి మోర్చా తెలంగాణ అధ్యక్షులు వగిలి ప్రభాకర్, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి కల్పన తదితరులున్నారు.

రూ.5.40 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్ దూసరి లావణ్య

అంబర్‌పేట: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. శుక్రవారం గోల్నాక శంకర్‌నగర్‌లో రూ.5.40 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో దశలవారిగా తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామన్నారు. అనంతరం స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జలమండలి అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులున్నారు.

హనుమాన్ రథయాత్ర



ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్ తదితరులు

కవాడిగూడ: హనుమాన్ జయంతి శోభాయాత్రలో భాగంగా దోమలగూడ హనుమాన్ దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ గొల్లగడ్డ రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన రథాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. గురువారం రాత్రి భక్తులతో కలిసి ఎమ్మెల్యే రథాన్ని లాగారు. ఈ రథయాత్రలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు పురుషోత్తం, శేఖర్, వేణు, సంతోష్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. దోమలగూడలోని బాలత్రిపుర సుందరీదేవి ఆలయంలో చైర్మన్ టి. రవీందర్ అన్నదానం నిర్వహించారు.

డిప్యూటీ స్పీకర్ పద్మారావు జన్మదిన వేడుకలు



కాచిగూడ: డిప్యూటీ స్పీకర్ పద్మారావు పుట్టినరోజు సందర్భంగా కాచిగూడకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎక్కాల కన్నా ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్‌చేసి, స్వీట్లను పంపిణీ చేశారు. రాజు, శ్రీనివాస్, సుధాకర్, ప్రభాకర్, వీరయ్య, రమేష్ తదితరులున్నారు.

మెరుగైన పారిశుధ్య నిర్వహణకు కృషి



సమీక్ష సమావేశంలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: మెరుగైన పారిశుధ్య నిర్వహణకు సమన్వయంతో విధులు నిర్వహించాలని బాగ్‌అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆమె కార్యాలయంలో జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య విభాగం అధికారులు, రామ్‌కీ సంస్థ ప్రతినిధులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని కొన్ని బస్తీల్లో పారిశుద్ధ్య సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు అధికంగా వస్తున్నాయన్నారు. పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. బీజేపీ నాయకులు వెంకట్ రెడ్డి, చుక్క జగన్, అధికారులు గోవర్ధన్‌రెడ్డి, ప్రదీప్ రెడ్డి తదితరులున్నారు.

రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ జిలుకర శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: 'రాహుల్ గాంధీపై అనర్హత వేటు సరికాదని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహస్యం చేసిందని' వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జిలుకర శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయటం బాధాకరమని ఆయనకు అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజాస్వామిక శక్తులు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి ఎం.డీ. రియాజ్, రాష్ట్ర నాయకురాలు బాలలక్ష్మీ, వీసీకే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, కేవీపీఎస్ ప్రధాన కార్యదర్శి స్కైలాబ్ బాబు, ఆర్‌పీఐ అధ్యక్షుడు మహేష్ బాబు, సీపీఐ నాయకులు స్టాలిన్, స్వేచ్ఛ జేఏసీ కో– ఆర్డినేటర్ కోల జనార్దన్, నీరటి కృష్ణ తదితరులున్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 7న శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా సెలవు ప్రకటిస్తే బాగ్‌లింగంపల్లిలోని ఓ ప్రైమరీ స్కూల్ పాఠశాలను నిర్వహించడం సరికాదన్నారు. ప్రైవేట్ స్కూల్స్ తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. పిల్లలు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని మండిపడ్డారు. దీనిపై పిల్లల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఇలాంటి స్కూళ్లపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

సీతారాముల కల్యాణ రథోత్సవం



చిక్కడపల్లి: సీతారాముల కల్యాణ రథోత్సవం కనులపండువగా జరిగింది. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న ఆలయ ప్రథమ వార్షికోత్సవాలు, బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి ముగిశాయి. ఈ సందర్భంగా రథోత్సవానికి భక్తుల హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ మురళిప్రసాద్, ఈఓ దేవనాథం, సభ్యులు బాసాని పద్మ, డాక్టర్ రామకృష్ణ, జీకె.రామకృష్ణ, గణేష్, ఆలయ అర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ, సిబ్బంది ఆచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఓయూ ఇంజినీరింగ్ కాలేజీకి కంప్యూటర్ ల్యాబ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీకి మహర్దశ పట్టింది. శుక్రవారం అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అత్యాధునిక కంప్యూటర్‌ల ల్యాబ్‌ను ప్రారంభించారు. కళాశాల అభివృద్ధికి దేశ విదేశాల్లో ఉన్న పూర్వవిద్యార్థులు అధికంగా సహాయం అందిస్తున్న విషయం విధితమే. పది రోజుల క్రితం కోల్ ఇండియా లిమిటెడ్ కంపెనీ అధికారులైన పూర్వవిద్యార్థులు కొత్తగా స్థాపించిన మైనింగ్ ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది వేతనాలకు విరాళంగా రూ.3 కోట్లను డిపాజిట్ చేసిన విషయం విధితమే. పూర్వవిద్యార్థులతో పాటు అమెరికాకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థకు దరఖాస్తు చేసుకోగా సహాయం చేసేందుకు ముందుకు వచ్చారు. అమెరికాకు చెందిన ఎస్ అండ్ పీ గ్లోబల్ కంపెనీ యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూ హెచ్) అనే అంతర్జాతీయ ఎన్‌జీఓ ద్వారా ఇంజినీరింగ్ కాలేజీకి 76 అత్యాధునిక 13 జనరేషన్ కంప్యూటర్లతో పాటు 48 బ్యాటరీలు, 2 యూపీఎస్, 2 వీడియో కాన్ఫరెన్స్ కిట్లు స్మార్ట్ బోర్డులు, ఇంజినీరింగ్ 41 మంది విద్యార్థినులకు ఫెలోషిప్‌లను అందిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ పేర్కొన్నారు.

విదేశీ విద్యను ప్రోత్సహిస్తున్న ఘనత ప్రభుత్వానిదే !

చిక్కడపల్లి: దేశంలోనే ఎక్కడాలేని విధంగా బ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి విదేశీ విద్యకు ప్రోత్సాహం కల్పిస్తున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనని టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభలో నాట్య వసంతోత్సవంలో శ్రీనివాస్‌గుప్తా మాట్లాడుతూ.. గొప్ప ధార్మిక సేవా పరాయణుడు సీఎం కేసీఆర్ అని కొనియాడారు. కృష్ణ అధ్యక్షతన ప్రతిష్టాపనాచార్య ఆర్.శివకార్తీక శాస్త్రి నేతృత్వంలో ఇరు రాష్ట్రాలకు చెందిన అర్చక, పురోహితుడితో 60 మందిని సత్కరించి పురస్కారాలను ప్రదానం చేశారు. రూపా, రామశర్మ, కృష్ణ, మల్లికార్జునే, ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.



ఘనంగా గుడ్ ఫ్రైడే



రాంనగర్‌లో నాటక ప్రదర్శన

ముషీరాబాద్: గుడ్‌ఫ్రైడే సందర్భంగా రాంనగర్‌లోని సెయింట్ ఫ్రాన్సిస్ ఆఫ్ అస్సీసి చర్చ్‌లో వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని భక్తులతో చర్చి ప్రాంగణం నిండిపోగా.. పాస్టర్లు దైవ సందేశాన్ని అందించారు. పలుచోట్ల క్రీస్తు శిలువ మరణం నాటకాన్ని ప్రదర్శించారు. బీఆర్ఎస్ రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు రావులపాటి మోజెస్, ఫాదర్ ప్రవీణ్ డిసోజా విన్సెస్ట్ డానియల్ రాజు, ప్రవీణ్‌ముదిరాజ్, సునిల్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీ ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ

నల్లకుంట: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంపై సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జిచే దర్యాప్తు చేయించాలని వైఎస్ఆర్‌టీపీ గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు కుతాడి రవి కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం నల్లకుంట పార్టీ కార్యాలయం నుంచి ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. నిరుద్యోగులకు మద్దతుగా ఈరోజు ఎంఆర్‌ఓ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. వైఎస్ఆర్‌టీపీ నాయకులు వెంకటేష్, ఎండీ షరీఫ్, నవీన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



జీవో 317 ప్రకారం బాధితులను తమ జిల్లాలకు కేటాయించాలి

రాష్ట్ర ఉపాధ్యాయ బాధితుల సంఘం డిమాండ్



మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేశ్వర్‌రావు తదితరులు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: జీవో నెంబర్ 317 బాధితులను తమ స్థానిక జిల్లాలకు కేటాయించాలని జీవో 317 రాష్ట్ర ఉపాధ్యాయ బాధితుల సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బి.నాగేశ్వర్‌రావు, ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉపాధ్యాయ బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో ఉపాధ్యాయ సంఘాల మధ్య ఐక్యత లేకపోవటం వల్లే అనేక సమస్యలు పరిష్కారం కావటం లేదన్నారు. కొన్ని సమస్యలు కోర్టు పరిధిలో ఉండగా.. మరికొన్ని కోర్టుకు సంబంధం లేని సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించటంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. సీపీఎస్‌ను రద్దు చేయటంతో పాటు గత పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో అన్ని రకాల జబ్బులకు క్యాష్‌లెస్ హెల్త్ స్కీమ్‌లను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులతో పాటు అన్ని రకాల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. 3 డీఏలను కూడా చెల్లించి ఖాళీగా ఉన్న పోస్టులకు నియామకాలు చేపట్టాలని కోరారు. ఉపాధ్యాయ బాధితుల సంఘం ప్రధాన కార్యదర్శి దత్త్రాద్రి, టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షులు హన్మంతరావు, టీయూటీఎఫ్ నాయకులు దశరథ్, నాయకులు నరేంద్రస్వామి తదితరులున్నారు.

గంగపుత్రుల పనిముట్లకు బీమా కల్పించాలి



మాట్లాడుతున్న తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు శ్రీహరి

కవాడిగూడ: చేపలు పట్టే గంగపుత్రుల పనిముట్లకు బీమా అవకాశం కల్పించి గంగపుత్రులను ఆదుకోవాలని తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడప శ్రీహరి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం కవాడిగూడలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రానికి వస్తున్న సందర్భంగా దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కేంద్ర ప్రభుత్వం గంగపుత్రుల అభివృద్ధికోసం కోటి రూపాయల విలువ చేసే సోనాబోట్‌ను 50 శాతం సబ్సిడీ, మరో 50 శాతం రుణ సదుపాయం కల్పించిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు.

- కేంద్రంలో ఇప్పటి వరకు పాలించిన పాలకులు, ఏర్పాటు చేయలేని గంగపుత్రుల సంక్షేమం కోసం ఆ శాఖకు ప్రత్యేక మంత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.
- అనేక సందర్భాల్లో గంగపుత్రుల న్యాయమైన సమస్యలను పరిష్కరించిన ప్రధాని చేపలు పట్టే పనిముట్లకు కూడా బీమా సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి శరణార్థి చంద్రప్రకాష్, కోశాధికారి ఎర్రబోయిన మల్లేష్, ఉపాధ్యక్షుడు గూడా బోయిన శివరత్నం, కార్యదర్శి ఆర్.కె. భగవాన్, సంఘం యువజన విభాగం అధ్యక్షుడు ఏఎల్ సుధాకర్ గంగపుత్ర, నాయకులు కుంట హరిశంకర్, శంకర్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరాహార దీక్షలు

లాలాపేట: హాస్పిటల్ కోసం మాణికేశ్వర్‌నగర్ అఖిలపక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మూడో రోజు బస్తీవాసులు పలువురు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంత కాలం ఓయూ భూములు ఆక్రమణకు గురికాకుండా వడ్డెర బస్తీ వాసులమే రక్షణగా ఉన్నామన్నారు. తమ బస్తీలో హాస్పిటల్ ఏర్పాటు కోసం గతంలో కేటాయించిన స్థలాన్ని తమ స్థలం అంటూ ప్రస్తుతం ఉన్న ఓయూ అధికారులు అడ్డుపడటం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని ఓయూ అధికారులతో మాట్లాడాలని కోరారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు రూపాని సత్యనారాయణ, లత తదితరులు సాయంత్రం నిమ్మరసంతో దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ఓర్సు శేఖర్, గండికోట విజయ్‌కుమార్, ఆలకుంట లింగయ్య తదితరులున్నారు.